క్లుప్తంగా

వైద్యసేవలు విస్తృతపరచాలి



మోరంపల్లిబంజర పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు

బూర్గంపాడు: గిరిజన గ్రామాలలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, అందుకు అనుగుణంగా సేవలను విస్తృత పరచాలని ఐటీడీఏ ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు సూచించారు. మోరంపల్లిబంజర పీహెచ్‌సీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను ఫార్మసీ గదిని, ఇన్ పేషంట్ వార్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లోని గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఐదు నెలలు నిండిన గర్భిణులకు టిఫ్ఫా స్కానింగ్ తప్పకుండా చేయించాలన్నారు. గిరిజన గ్రామాల్లో డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలకుండా వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా వైద్యులు, వైద్య సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీ సాహితి, పాయం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠ

గుండాల: శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమం మండల కేంద్రంలో శనివారం ఘనంగా ప్రారంభించారు. పూజారులు కేతముక్కల పవన్ కుమార్ శర్మ, శ్రీరంగం సనత్ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వమించారు. యాగశాల ప్రవేశం చేసి, మహాలక్ష్మి విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా అమ్మవారిపై జలాభిషేకం చేశారు. ఆదివారం హోమం, పూజా కార్యక్రమాలు, సోమవారం విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని పూజారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ధాతలు పోలు కనకయ్య–రాజేశ్వరి, పోలు రమేష్–రేణుక, రిత్విక్, నాగరోహిత్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండల కేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ స్వామివారి క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరిశుభ్రత ప్రతీ ఉద్యోగి బాధ్యత

మణుగూరుటౌన్: పరిశుభ్రత ప్రతి ఉద్యోగి బాధ్యత అని, కార్యాలయాలు, కాలనీలు, ప్రాజెక్టులు ప్రాంతాల్లో పరిశుభ్రతమైన వాతావరణం ఉంటే పనితీరు మెరుగుపడుతుందని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. శనివారం స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమంలో భాగంగా జీఎం కార్యాలయం ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు పాల్గొన్నారు.

‘ప్రైవేటు’ భాగస్వామ్యాన్ని రద్దు చేయాలి

అశ్వారావుపేటరూరల్: బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డులో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల భాగస్వామ్యాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి డిమాండ్ చేశారు. శనివారం అశ్వారావుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా నాల్గోవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ నంబరు 12ను రద్దు చేసి, సంక్షేమ బోర్డు నుంచి ప్రైవేటు కంపెనీలకు బదిలీ చేసిన రూ.346 కోట్లను వెనక్కి తీసుకోవాలని కోరారు. సంక్షేమ బోర్డు అడ్వైజరీ కమిటీను అనుభవం ఉన్న ట్రేడ్ యూనియన్ నాయకులతో నియమించాలని అన్నారు. జిల్లా కార్యదర్శి ఉప్పుతల నరసింహారావు, పిట్టల అర్జున్, గుర్రం రాములు, యర్రంశెట్టి వెంకట రామారావు, నిమ్మల మధు, నాగరాజు, తాళ్లూరు కృష్ణ, సుధాకర్, ఎస్‌కే జాకీర్, వేణు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ

దుమ్ముగూడెం: పర్ణశాల పుణ్యక్షేత్రంలోని సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం పర్ణశాల ఆలయంపై ఆధారపడి భిక్షాటన చేస్తున్న 8 మందికి 40 కేజీల బియ్యం, నిత్యావసరాలను శనివారం పంపిణీ చేయడం జరిగింది. ఆలయ ప్రాంగణంలో భిక్షాటన చేస్తున్న యాచకులకు దాతల సహకారంతో తలా 5కేజీలు బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గోసుల నాగేశ్వరరావు, పర్ణశాల ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ఎంటీఓ సున్నం సమ్మయ్య, పర్ణశాల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ప్రభాకర్, గ్రామ పెద్దలు ఆకుల లక్ష్మీపతిరావు, ముక్కెర రాంబాబు, పూదోట సూరిబాబు, పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మి, జ్యోతి కుమార్, శ్రీనివాస్, జోగా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చదువుల ఒడిలో ‘కోయ నర్సాపురం’

- చదువుపై గ్రామం ప్రత్యేక దృష్టి
- ప్రతీ ఇంటిలో అక్షరాస్యులు.. డజన్ల సంఖ్యలో పట్టభద్రులు
- ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో దూకుడుగా స్థానిక యువత



చదువుల పండుగ నిర్వహిస్తున్న గ్రామస్తులు (ఫైల్)

సండే స్పెషల్

దుమ్ముగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో పెద్ద మండలమయినా దుమ్ముగూడెం గ్రామంలో చదువుల సరస్వతిగా కోయనర్సాపురం పేరుగాంచింది. గ్రామంలో సుమారు 200కు పైగా కుటుంబాలు ఉండగా.. ప్రతీ ఇంటిలో విద్యావంతులు ఉండడం విశేషం. గ్రామ ప్రజలు,యువత ప్రతిష్ఠాత్మకంగా చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. చాలా మందిని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు సంపాదించారు. ప్రస్తుతం గ్రామంలో నిరక్ష్యరాస్యత నిర్మూలనే లక్ష్యంగా స్థానికులు ముందుకు వెలుతున్నారు.

2006లోనే పునాదులు..

గ్రామంలో ఒకప్పుడు నిరక్ష్యరాస్యత తాండవించింది. పూర్తిగా గిరిజన గ్రామం కావడంతో స్థానికులు చదువుపై అంతగా ఆసక్తి కనబర్చలేకపోయారు. ఈ నేపథ్యంలో 2006లో వర్ష ముదరాజు, పెడకం వెంకటేశ్వర్లు 10వ తరగతి పూర్తి చేసి.. గ్రామంలోని యువత కూడా చదువులో రాణించేందుకు దృష్టి పెట్టారు. సుమారు 10 మంది విద్యార్థులకు ఉన్నత స్థానం వైపు పయనించేందుకు లక్ష్యాలను ఏర్పరిచారు. అప్పటి నుంచి గ్రామంలో విద్యావంతులు ముందుకు రావడం ప్రారంభమైంది.

విభిన్న ఉద్యోగాల్లో స్థానం

ప్రస్తుతం గ్రామంలోని చాలా మంది పట్టభద్రులు కాగా.. వారిలో అనేకులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. గ్రామానికి చెందిన పర్షిక వెంకటేష్ సివిల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తుండగా, పెడకం మనోజ్ ఎంబీబీఎస్ వైద్యుడిగా చేస్తూ.. పీజీ చదువుతున్నాడు. ఉయికా రూబిక బీడీఎస్, తెల్లం సరోజిని, వర్షా కమల స్టాఫ్ నర్సులుగా, వర్షా కొండమ్మ, పెడకం ధర్మమ్మలు ఫిజికల్ డైరెక్టర్లుగా, పెడకం స్నేహ సింగరేణిలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

వీరితో పాటు పలువురు గ్రామస్తులు ప్రైవేట్ ఉద్యోగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారు. మరోవైపు, పరుగుల రాణి పాయం కుమారి జాతీయ స్థాయిలో అథ్లెటిక్స్‌లో రాణిస్తూ.. దేశస్థాయిలో పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తోంది.

మూడు పర్యాయాలు చదువుల పండగ..

గ్రామంలో చదువుపై యువతకు ప్రేరణ కలిగించేందుకు చదువుల పండుగను నిర్వహిస్తున్నారు. 2006 నుంచి ప్రతీ ఏడాదిలో మూడు సార్లు ఈ కార్యక్రమాలను విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. ఇందులో భాగంగా విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల మనోగతాలను తెలుసుకుంటూ.. మిగిలిన యువతకు దిశా నిర్దేశం ముందుకు వెళుతున్నారు.

నిరక్ష్యరాస్యత నిర్మూలనే లక్ష్యం..

నిరక్ష్యరాస్యత నిర్మూలన లక్ష్యంగా గ్రామ పెద్దలు, ఉద్యోగులు పని చేస్తున్నారు. ఉద్యోగాలు సాధించిన వారు ప్రస్తుత యువతకు మార్గదర్శులుగా వ్యవహరిస్తూ.. వారిలో కొలువులు సాధించాలనే కసిని కలుగచేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్‌ల నుంచి ఏదైనా నోటిఫికేషన్ వస్తే.. వెంటనే గ్రామంలో ఉన్న నిరుద్యోగులకు చేరవేస్తూ సహకరిస్తున్నారు.

– వర్ష ముద్రాజు, గ్రామస్తుడు

సమష్టిగా మాట్లాడుకుంటాం..

చిన్నప్పటి నుంచే విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిని ఉన్నత చదువులకు సంసిద్ధం చేస్తాం. ఏదైనా ప్రభుత్వ నోటిఫికేషన్లు వచ్చిన వెంటనే సమష్టిగా మాట్లాడుకుని దరఖాస్తులు చేయిస్తాం. గ్రామంలో సుమారు 200 కుటుంబాలు ఉంటే దాదాపు అన్ని కుటుంబాల్లో చదువుకున్న వారు ఉండటం చాలా సంతోషంగా ఉంది.

– తెల్లం రామకృష్ణ, గ్రామస్తుడు

వైభవంగా అమ్మవారి ఊరేగింపు



అశ్వారావుపేటరూరల్: కొత్త మామిళ్లవారిగూడెంలో కోలాట నృత్యాలతో ఊరేగింపు..



ములకలపల్లి: శివాలయం వద్ద ప్రతిష్ఠించిన దుర్గామాత శోభాయాత్ర..

అశ్వాపురం: శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో రాజీవ్ స్ట్రీట్‌లో గత పది రోజులుగా రాజీవ్ స్ట్రీట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామం పురవీధులలో భక్తులు అమ్మవారికి నీరాజనాలు పలికారు. ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు, చిన్నారులు ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

అశ్వారావుపేటరూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొలువు దీరిన అమ్మవారి విగ్రహాలను శనివారం ఊరేగింపు కార్యక్రమాలు వైభవంగా సాగాయి. అశ్వారావుపేట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, కొనేరు బజారు, పాత రామాలయం, డ్రైవర్స్ కాలనీ, పేరాయిగూడెంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను ఉత్సవాల ముగింపు నేపథ్యంలో పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు, చిన్నారుల కోలాట నృత్యాలు, తీన్మార్ నృత్యాలతో సందడి చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోగల చెరువుల్లో భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.



అశ్వాపురం: మొండికుంట రాజీవ్ స్ట్రీట్‌లో అమ్మవారి ఊరేగింపు..

ములకలపల్లి: మండలవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రులు వైభవోపేతంగా చేశారు. ప్రత్యేక మండపాల్లో దుర్గామాతను ప్రతిష్ఠించి, తీరొక్కరీతిన అలంకరించి. పూజాధికాలు చేశారు. శనివారం అమ్మవారి విగ్రహ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో అలంకరించిన ట్రాక్టర్లలో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి, మహంకాళిని పురవీధుల్లో ఊరేగించారు. మేళతాళాల నడుమ తీన్‌మార్ నృత్యాలతో యవకులు. మహిళలు, భక్తులు శోభాయాత్ర చేసి, మూకమామిడి ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు.

లక్కీ డ్రాను సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంఅర్బన్: దసరా సమయంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్కీ డ్రాను సద్వినియోగం చేసు కోవాలని భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ జంగయ్య అన్నారు. భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో లక్కీ డ్రా డ్రాప్ బాక్స్ ను ఇప్పటికే ఏర్పాటు చేశామని, రేపటి వరకు మాత్రమే ఈ అవకాశం ఉందని, అది కూడా సెమి డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి, రాజధాని బస్సు సర్వీసులలో ప్రయాణించే వారు మాత్రమే లక్కీ డ్రాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ప్రయాణికులు టికెట్ వెనకల ఫోన్ నెంబర్ పేరు రాసి భద్రాచలం ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా డ్రాప్ బాక్స్ లో వేయాలన్నారు. ముగ్గురు విజేతలకు ఖమ్మం రీజియన్ పరిధిలో బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతిగా రూ.25,000, రెండో బహుమతిగా రూ.15,000, మూడో బహుమతిగా రూ.10,000 అందించనున్నట్లు వివరించారు.

పెద్దిపల్లిలో వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామమైన పెద్దిపల్లిలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరం లో వైద్యసిబ్బంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యసిబ్బంది గ్రామంలోని ఇంటింటిని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులకు పలు సూచనలు ఇచ్చారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, శైలజ, వెంకటమ్మ, రోజా తదితరులు పాల్గొన్నారు.

వృథాగా భగీరథ జలం

ములకలపల్లి: మిషన్ భగీరథ నీళ్లు వృథాగా పోతున్నాయి. మెయిన్ పైపుకు ఏర్పాటు చేసిన ఎయిర్ వాల్వ్ నుంచి గంటల తరబడి శుద్ధజలం నిరంతరాయంగా ఎగసి చిమ్ముతోంది. అయినా సంబంధిత అధికారులెవరూ స్పందించకపోవడం గమనార్హం. ములకలపల్లి మండలపరిధిలోని ఏఎంసీ మార్కెట్ గోదాం సమీపంలోని పాల్వంచ–మండలపల్లి ఆర్అండ్‌బీ రోడ్డుపై మాధారం శివారు వాగు బ్రిడ్జిపై మిషన్ భగీరథ పైపులైన్ వాల్వ్ లీకైంది. దీంతో నీరంతా వృథాగా బయటికి పోయింది. ములకలపల్లికి వచ్చే మెయిన్ లైన్ కావడంతో వాటర్ ప్రెషర్‌గా ఎగచిమ్ముతోంది. దీంతో భారీగా నీరు వృథాగా పోతూ, వంతెనపై నీటి వరద ప్రవహిస్తోంది. రాత్రి వేళ వరకూ నీళ్లు లీకౌతునే ఉన్నా, అధికారులెవరూ దృష్టి సారించలేదు.



మెయిన్ లైన్ ఎయిర్ వాల్వ్ నుంచి వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

పెరిక సంఘం వితరణ



నిత్యావసరాలు అందజేస్తున్న పెరిక సంఘం నేతలు

చర్ల: మండలంలోని ఆర్ కొత్తగూడెం గ్రామ పంచాయతీ దానవాయిపేటకు చెందిన కొల్లూరి పుల్లయ్యకు పెరికసంఘం అండగా నిలిచింది. వృద్ధుడైన పుల్లయ్య గుడిసె వర్షాలకు కూలీ.. టార్పాలిన్ వేసుకొని నివస్తున్నాడు. పరిస్థితిని గమనించిన స్థానిక పెరక సంఘం నాయకులు వృద్ధుడికి శనివారం రూ.10 వేల నగదు, 50 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆకుల ప్రసాద్, ఉపాధ్యక్షులు కొమ్మా వీరభద్రం, గౌరవ అధ్యక్షుడు అల్లి ఉమా మహేశ్వరావు, సీనియర్ నాయకులు గొర్ల రాజబాబు, ఉగ్గడి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

దళిత వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

చండ్రుగొండ: మండల కేంద్రం చండ్రుగొండ గ్రామ పంచాయతీ వార్డుల్లో దళిత వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం అన్యాయమని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఈ మేరకు నిరసన తెలిపారు. పంచాయతీలో 14వార్డులు ఉండగా అందులో ఒక్క వార్డు దళితులకు రిజర్వ్ చేయకపోవడం విచారకరమన్నారు. రిజర్వేషన్ పట్ల అధికారులు పునరాలోచించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు తలారి నాగరాజు, మిరియాల మోహన్ రావు, ఇల్లంగి బాలకృష్ణ, రాజా, బడుగు సురేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దామోదర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళి

అశ్వాపురం: తుంగతుర్తిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి స్వగృహంలో దామోదర్‌రెడ్డి మృతదేహానికి శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బూరెడ్డి వెంకటరెడ్డి, తోట మలయ్య, చుంచు ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

పినపాక: మండల పరిధిలోని ఎల్చిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని పలువురు శనివారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ మేరకు మండల పార్టీ కార్యాలయంలో ఎల్చిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సోడే సుధాకర్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు బీఆర్ఎస్ చేరాయి. వారికి మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వానికి చెంపపెట్టుగా మారాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, నాయకులు వాసు బాబు, రవి శేఖర్ వర్మ, భద్రయ్య, దొడ్డ శ్రీనివాసరెడ్డి, ముక్కు నాశ రెడ్డి, ముక్కు వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికలకు సహకరించాలి

స్థానిక సంస్థల ఎన్నికలపై జిల్లా సహాయ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్న ఎంపీడీఓలు శనివారం పలు విభాగాల అధికారులు, వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు ఏర్పాట్లన్నీ సిద్ధమైనట్లు వివరించారు. అభ్యర్థుల నామినేషన్లు, నియమ నిబంధనలు, ఓటర్లు, పోలింగ్ స్టేషన్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. శాంతియుత ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని రాజకీయ వర్గాలను కోరారు.



మణుగూరుటౌన్: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

మణుగూరుటౌన్: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు సమావేశం ఏర్పాటు చేయగా.. తహసీల్దార్ నరేశ్, సీఐ నాగబాబు, జెడ్పీటీసీ రిటర్నింగ్ ఆఫీసర్ స్వర్ణలత, ఎంపీటీసీ రిటర్నింగ్ అధికారులు, నోడల్, పంచాయతీ కార్యదర్శులు, అఖిలపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ఎంపీడీఓ అప్పారావు నియామావళి వివరించగా.. నాయకులు చిరంజీవి, గన్నిన రామకృష్ణ, విజయ్‌కాంత్ పాల్గొన్నారు.

చండ్రుగొండ: ఎంపీడీఓ కార్యాలయంలో.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల నిర్వహణపై చర్చించారు. వివిధ పార్టీల నాయకులతోపాటు ఎంపీడీఓ బయ్యారపు అశోక్, అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధే పోలీసుల లక్ష్యం



రామచంద్రాపురం వెళ్లేందుకు వాగు దాటుతున్న ఏఎస్పీ, కమాండెంట్‌లు

చర్ల: అభివృద్ధికి దూరంగా ఉంటూ అన్ని విధాలుగా ఇబ్బందులకు గురవుతున్న ఆదివాసీలను అభివృద్ధి చేయడమే పోలీసుల ఏకైన లక్ష్యమని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న బట్టిగూడెం, రామచంద్రాపురం, బత్తినపల్లి గ్రామాల్లో నెస్లే కంపెనీ వారి సహకారంతో 120 కుటుంబాల వారికి సుమారు రూ.1.20 లక్షల విలువ చేసే నిత్యావసర వస్తువులను అందజేశారు. ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ సబాస్టిన్ చేతుల మీదుగా అందజేసిన ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మాట్లాడుతూ.. అసాంఘిక శక్తుల ఆట కట్టేందుకు ఆదివాసీలంతా పోలీసులకు చేదోడువాదోడుగా నిలవాలని, మావోయిస్టులకు ఎవ్వరూ సహకరించవద్దని సూచించారు. కాగా, ఆయా గ్రామాల్లోని ఆదివాసీలకు నిత్యావసర వస్తువులు అందించేందుకు తరలివెళ్తున్న సందర్భంలో మార్గ మధ్యలో ఉన్న వాగులను దాటుతూ ఏఎస్పీ, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్, ఇతర పోలీసు అధికారులు అతికష్టం మీద చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్ల సీఐ ఏ.రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకే కేటాయించండి

మణుగూరురూరల్: ఏజెన్సీ ప్రాంత జిల్లాల్లో జెడ్పీ చైర్మన్ పదవులను ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు సోలం హరిశంకర్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గిరిజనేతరుల రిజర్వేషన్‌ను ఏజెన్సీప్రాంతాల్లో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తుర్రం రవికుమార్, చందా రామకృష్ణ, పడిగ వీరభద్రం, మడకం ప్రసాద్, వాడ రాంబాబు, కొంద్రు నాగేందర్, సోలం కుమార్ స్వామి, గొగ్గల కోటేష్ పాల్గొన్నారు.

స్థానికేతరులను సహించం..

గుండాల: త్వరలో జరుగునున్న స్థానిక ఎన్నికల్లో స్థానికేతరులు వస్తే సహించేది లేదని, ఆదివాసీ సంఘాల నుంచే ఉమ్మడి అభ్యర్థిని బరిలో దింపుతామని తుడుందెబ్బ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు కొడెం వెంకటేశ్వర్లు, గుంపిడి వెంకటేశ్వరు, చంద్రయ్యదొరలు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుండాల జెడ్పీటీసీ కోసం ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారని, ఆదివాసీ చూస్తూ ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పూనెం రామకృష్ణ, పూనెం రమణబాబు, లక్ష్మన్, మహేందర్, సందీప్, గోవింద నర్సింహరావు, మోకాళ్ల కన్నయ్య, పాపారావు, వజ్జ ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



గుండాల: సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

క్రీడాకారుడికి అభినందనలు



శంకర్‌రావును అభినందిస్తున్న ఎస్పీ రోహిత్ రాజ్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడిని ఎస్పీ రోహిత్ రాజ్ అభినందించారు. పట్టణానికి చెందిన శంకర్‌రావు పవర్ లిఫ్టింగ్ పోటీలలో జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ లో నాలుగు బంగారు పతకాలు సాధించడంతో పాటు బెస్ట్ ఆఫ్ ఇండియా అధికారికంగా గుర్తించిన సందర్భంగా శనివారం ఎస్పీ రోహిత్ రాజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 73 ఏళ్ల వయసులో బైపాస్ సర్జరీ జరిగినా లెక్క చేయకుండా రికార్డులను సాధించడం జిల్లాతో పాటు రాష్ట్రానికి గర్వకారణమని, శంకర్రావ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిమ్ కోచ్ రామిరెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై పలు పార్టీల ఆధ్వర్యంలో శనివారం సభలు, సమావేశాలు నిర్వహించారు. ఆయా పార్టీల నాయకులు తమ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతిపక్షాలు ప్రభుత్వ లోపాలని వివరించాలని సూచించాయి.



దమ్మపేట: సమావేశంలో మాట్లాడుతున్న మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం

దమ్మపేట: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం ఆధ్వర్యంలో లింగాలపల్లిలో సమావేశం నిర్వహించి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. నాయకులు గోకనపల్లి ప్రభాకర్, అమర్లపూడి రాము, కురసం ముత్యాలరావు, అప్పారావు, రమేష్ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు లంకా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లక్ష్మీనగరం గ్రామంలో సమావేశం నిర్వహించగా.. భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, మాజీ జెడ్పీటీసీ అన్నే సత్యనారాయణ మూర్తి, మాజీ సర్పంచ్‌లు మట్ట వెంకటేశ్వరరావు, మడకం చందు, తెల్లం రామకృష్ణ, మడకం నాగేంద్ర, వర్ష చిన్నారావు,కట్టం కృష్ణ, కంగాల వెంకటేష్,కణితి సమ్మయ్య, మాజీ ఎంపీటీసీలు తెల్లం భీమరాజు, సోడే తిరుపతిరావు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణలు శనివారం గంగోలు వద్ద వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జెడ్పీటీసీ అభ్యర్థి సాగి శ్రీనివాసరాజు, మండల కన్వీనర్ కణితి రాముడు, కో కన్వీనర్ జానీ పాషా, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు కొత్త మల్లేష్, బొల్లి వెంకటరావు, కాలువ పూర్ణయ్య, పిసోడి వెంకటేష్, తునికి కామేష్, అపకా వీర్రాజు, కొత్తూరు సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న లంకా శ్రీనివాసరావు

చర్ల: బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూపా రమేష్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయగా.. బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బాబా పాహీం పలు సూచనలు చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి, రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరావు పిలుపునిచ్చారు. చర్లలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు నానిపల్లి భద్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అడ్డగర్ల తాతాజీ, మండల అధ్యక్షుడు నూపా పోతయ్య, మండల సహాయ కార్యదర్శులు మత్యాలరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.